
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
మంగళవారం 27 ఫిబ్రవరి 2024




కోహెడలో పాదయాత్ర చేస్తున్న ఎంపీ బండి సంజయ్


హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం


సిలిండర్‌కు పూలు వేసి మహిళకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- రూ.1200కు పెంచిన ఘనత వారిదే
- బండి సంజయ్ ఎంపీగా ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి?
- మతపరంగా కాదు.. ప్రజాస్వామ్యయుతంగా ఓట్లు అడగాలి
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ప్రజాహిత యాత్రలు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

బీజేపీ రూ.500కే సిలిండర్ ఇస్తదా?

హుస్నాబాద్, ఫిబ్రవరి 26 : బీజేపీ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందా అని ప్రజాహిత యాత్ర చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రశ్నించారు. రూ.500 ఉన్న సిలిండర్‌ను రూ.1200కు పెంచిన ఘనత బీజేపీదేనని ఆయన విమర్శించారు. సోమవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకోని సంజయ్, ఎన్నికలు వస్తున్నాయని రామాలయం పేరు మీద ఓట్లు అడగటం కాదు, ప్రజాస్వామ్యయుతంగా అడగాలని సూచించారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చెప్పాలని, ఎంపీగా ఏం కొట్లాడారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ ప్రజాహిత యాత్రలు చేస్తుందని పొన్నం ప్రభాకర్‌గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేస్తున్నామని, వంద రోజులు పూర్తి కాకముందే ప్రభుత్వాన్ని కూలగొడుతామనే మాటలపై ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుంటంతో మహిళల్లో ఉత్సాహం నెలకొన్నదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. మహిళలకు రూ.500కే గ్యాస్ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని మంగళవారం చేవెళ్లలో ప్రారంభిస్తుండటంతో మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలతో కలిసి క్యాంపు కార్యాలయంలో గ్యాస్ సిలిండర్‌కు పూలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కాంగ్రెస్ నాయకులు బంక చందు, అక్కు శ్రీనివాస్, వివి రమణ, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, నది తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా పొట్లపల్లిలో భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సోమవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిచిన తర్వాత ప్రథమంగా ఆలయ అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేశామన్నారు. డివిజన్‌స్థాయి అధికారులతో జాతర ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేసి పొట్లపల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. తాను మంత్రి హోదాలో మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహిస్తానన్నారు. జాతరకు వచ్చే భక్తులకు దైవ దర్శనంలో ఒకే విధానాన్ని అనుసరించాలన్నారు. హుస్నాబాద్ నుంచి పొట్లపల్లి వరకు డబుల్‌రోడ్డు, పందిల్ల నుంచి పర్వేద, నవాబుపేట, ఆలయం నుంచి పందిల్ల వరకు రోడ్డు పనులకు, ఆలయం ఎదుట చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రోడ్డుకిరువైపుల ఉన్న చెట్ల పొదలను తొలగించాలని, మొరం ట్రిప్పులకు ఎస్టిమేషన్ చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం బస్సులు నడపాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి సూచించారు. తాగునీటి వసతిని కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. జాగారం భక్తులకు అల్పాహారంగా కందగడ్డను అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆలయ ఈవో కిషన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, స్థానిక నాయకులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.


శివరాత్రి జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి

పొద్దు తిరుగుడు గింజలకు క్వింటాకు రూ.6,780 మద్దతు ధర

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పొద్దు తిరుగుడు విత్తనాల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. పొద్దు తిరుగుడు గింజలకు క్వింటాలుకు రూ.6,760 మద్దతు ధర ఉందన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసుకుంటే ఒక ఎకరా ఖాళీగా ఉండదని, త్వరలోనే అది పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ మానస, ఎగ్గిడి అయిలయ్య, కార్యదర్శి వెంకటయ్య, ఏడీఏ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలు ఏమయ్యాయి?

- ప్రజలను మభ్యపెట్టడం తప్ప చేసిందేమిటి?
- పొన్నం, కేటీఆర్‌కు నన్ను తిట్టడమే పని
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- కోహెడలో ప్రజాహిత యాత్ర ప్రారంభం

కోహెడ ఫిబ్రవరి 26 : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండల కేంద్రంలో మలిదశ ప్రజాహితయాత్రను బండి సంజయ్ సోమవారం ప్రారంభించారు. కోహెడ, తీగలకుంటపల్లి, గొట్లమిట్ట, నారాయణపూర్, విజయనగర్‌కాలనీ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజాహిత యాత్ర సందర్భంగా కోహెడలో ఆయన ప్రజల నుద్దేశించి మాట్లాడారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పేరుతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప వాళ్లు చేసిందేమిటి అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి కేటీఆర్ 24 గంటలు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గ పరిధిలో చేసిన అభివృద్ధిని చెప్పేందుకు తాను యాత్ర చేస్తున్నానని, కాంగ్రెస్ పాలనలో, పొన్నం ఎంపీగా ఉన్నప్పుడు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. ప్రజల కోసం కొట్లాడితే తనపై వంద కేసులు పెట్టినా లెక్క చేయలేదని ఆయన వివరించారు. విమర్శలే ప్రాతిపదికన రాజకీయాలు చేస్తామనడం ప్రజాస్వామ్యం కానేకాదని పేర్కొన్నారు. మోదీ ప్రధాని కావాలా? రాహుల్ ప్రధాని కావాలా? ప్రజలు ఆలోచించాలని చెప్పారు. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లను బీజేపీ క్లీన్ స్వీప్ చేయబోతున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ ప్రభారీ మీసాల చంద్రయ్య, కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపరెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ నియోజకవర్గానికి రూ.698 కోట్లు

హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.698 కోట్ల ఖర్చు చేశామని బండి సంజయ్ వివరించారు. గ్రామీణ సడక్ యోజన కింద రూ.7 కోట్లకుపైగా కేటాయించి రోడ్లను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణం కోసం రూ.578 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.196 కోట్ల ఉపాధి హామీ నిధులు ఖర్చు చేశామని తెలిపారు. మొక్కల పెంపకానికి కేంద్ర నిధులు రూ.118 కోట్లు, కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ109.36 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఇవన్నీ సర్కారు లెక్కలే అని, తాను చెప్పిన లెక్కలన్నీ తప్పయితే కేసు పెట్టుకోవచ్చని హితవు పలికారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మీరు చేసిందేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌కు గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. యువత, పార్టీ శ్రేణులు సెల్ఫీల కోసం పోటీపడ్డారు.


మాట్లాడుతున్న బండి సంజయ్



'ప్రజావాణి' సమస్యలను పరిష్కరించండి

6

కలెక్టరేట్‌లో ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

అమృత్ భారత్‌తో మహర్దశ

రూ. 15.31 కోట్లతో మెదక్ రైల్వేస్టేషన్ అభివృద్ధి

- పనులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ
- కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- జిల్లా ప్రజలకు ప్రయోజనకరం : కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: రైల్వేస్టేషన్లను ఆధునికంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మెదక్ స్టేషన్‌ను అభివృద్ధి చేసే పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. వర్చువల్ పద్ధతిలో సోమవారం ఆయన మెదక్ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదక్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని తిలకించేందుకు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆట్టహాసంగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగిస్తూ సామాన్యులు ఎక్కువగా ఉపయోగించే రైల్వేలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైల్వే రంగంలో వస్తున్న మార్పులను మీ కళ్లతో చూస్తున్నారన్నారని, వందే భారత్ వంటి రైళ్ల గురించి గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచించలేదని పేర్కొన్నారు. అనంతరం మెదక్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపిక చేసి రూ.15.31 కోట్లు నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. మెదక్‌కు రైలు మార్గం వేయడం ద్వారా ఈ చుట్టుపక్క ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మనోహరాబాద్ జంక్షన్‌గా ఏర్పడే అవకాశం ఉన్నందున మెదక్ లైన్ కలుపడంతో ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే సర్వే పూర్తయిన మెదక్ నుంచి పటాన్‌చెరు వయా (వట్టినాగులపల్లి) జోగిపేట-సంగారెడ్డి రైల్వేలైన్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు.


వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ


మెదక్‌లో అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ శేరి, కలెక్టర్ రాజర్షిషా

ఉద్యోగ ఉపాధి అవకాశాలు

మెదక్ రైల్వే స్టేషన్‌కు నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు ఆధునికీకరించడం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధితో జిల్లాలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మహిళలకు, విద్యార్థులకు, ఉద్యోగులతోపాటు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి లబ్ధిచేకూరుతుందని తెలిపారు. అంతకుముందు విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రైల్వే సీనియర్ డీఈ శ్రీతేజ, అధికారులు రాజు, నర్సింహ, వినయ్, రహమాన్, స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్, స్టేషన్‌మాస్టర్ పద్మారావు, నవనీత్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులకు శంకుస్థాపన

మాసాయిపేట/రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 : దేశవ్యాప్తంగా రైల్వే పనులకు సోమవారం ప్రధానమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామాంతపూర్ రైల్వేగేటు వద్ద, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. రామాంతపూర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రణీత వేణుగోపాల్‌రెడ్డి, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు. ఈదులనాగులపల్లి వద్ద కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్ శంషాబాద్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి దక్షిణమధ్య రైల్వే నోడల్ అధికారి రామాంజనేయరావు, స్టేషన్ మేనేజర్ బుచ్చిరెడ్డి, సెక్షన్ ఇంజనీర్ మల్లేష్, స్టేషన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 28 నుంచి మార్చి 16 వరకు నిర్వహణ
- సిద్దిపేట జిల్లాలో 44 కేంద్రాల ఏర్పాటు
- సీసీ కెమెరాలో నిఘాలో ప్రశ్నాపత్రాల విడుదల
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు


6


నంబర్లు వేస్తున్న అధ్యాపకురాలు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరిస్తే.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

- మాజీ మంత్రి ఈటల రాజేందర్ సవాల్

సిద్దిపేట క్రైం/తొగుట/గజ్వేల్, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ సవాల్ చేశారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర గజ్వేల్, తొగుట మండలం, సిద్దిపేట పట్టణ పరిధిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాములని, బీజేపీ హయాంలో ఒక్క అవినీతి మచ్చలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చేది లేదని, వారికి ఓటేస్తే అడుక్కతినుడేనని, అప్పుల కుప్పఅవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతానని ఎప్పుడు అనుకోలేదని, అందుకే అమలు కానీ హామీలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని తెలిపారు. మోదీ పేదింటి బిడ్డ, ... కాదన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడు ...పారిశుధ్య కార్మికుల కాళ్లను మోదీ కడిగి, వారిని గౌరవించారని గుర్తుచే... ...ఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు, కాలువలు, రైల్వే లైన్ల కోసం భూములు లాక్కుందని, పెద్దలకు కట్టబెట్టేందుకు పేదల భూములను నోటిపై చేసిందని, వాటిని రద్దు చేయాలని ఈటల రాజేందర్ కోరారు. ఈ విషయమై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని అందజేస్తానని తెలిపారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలను గత ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్‌లో అడ్డా కూలీలుగా మార్చాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశం సుభిక్షంగా ఉండటం కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సిద్దిపేట పట్టణంలో బీజేపీ సంకల్ప యాత్రలో భాగంగా బ్లాక్ ఆఫీస్ నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేశ్‌గౌడ్, తొగుట మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రంముదిరాజ్, ధరం గురువారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బీసీలకు ఎంపీ సీట్లు కేటాయించాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26 : జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాలుగా బీసీలు అణిచివేతకు గురయ్యారన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారే కానీ ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంలో వాటా ఇవ్వాలని, ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని, బడ్జెట్‌ను మరింత పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీ ఉద్యమానికి పార్టీలకతీతంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్, మద్దికొండ కొండయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈనెల 28 నుంచి మార్చి 16 వరకు నిర్వహణ
- మెదక్ జిల్లాలో 30, సంగారెడ్డి జిల్లాలో 52, సిద్దిపేట జిల్లాలో 44 కేంద్రాల ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఈనెల 28 నుంచి మార్చి 6వ తేదీవరకు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. ఉదయం 8 గంటల వరకు పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాల కవర్లను తెరుస్తారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా హాల్ టికెట్‌ను సంబంధింత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావచ్చు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

మెదక్ జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 13,172 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రశ్నాపత్రాల స్టోరేజీకి 14 పాయింట్లు ఏర్పాటు చేశారు. 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, 4 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 కస్టోడియన్ బృందాలు, 600 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించారు.

ప్రత్యేక కంట్రోల్ రూం

విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు ఈ నంబర్లు పనిచేస్తాయి. సమస్య ఉన్న విద్యార్థులు 7671033323 లేదా 9603615652 నంబర్లను సంప్రదించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ అన్నారు.

గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26: విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల నిమిత్తం జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ 15,984 మంది, వొకేషనల్ 1,681, మొత్తం-17,665 మంది, అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ 17,057, వొకేషనల్ 1,431, మొత్తం-18,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, డీఈసీ మెంబర్లు, హైపవర్ కమిటీ, ఫ్లైయింగ్ స్క్వార్డ్, సిట్టింగ్ స్క్వార్డ్, 925 ఇన్విజిలేటర్లను నియమించామ ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ తెలిపారు.



సిద్దిపేటలోని బాలుర జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 26: రేపటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సూర్యప్రకాష్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సర 9,831 మంది, రెండో సంవత్సర 11,118 మంది, మొత్తం 20,949 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల నిమిత్తం సిద్దిపేట జిల్లాలో మొత్తం 44 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, హై పవర్ టీమ్, డిస్ట్రిక్ ఎగ్జామినేషన్‌తో కలిపి మొత్తం మూడు కమిటీలను ఏర్పాటు చేసింది.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన గజ్వేల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గజ్వేల్‌టౌన్/గజ్వేల్, ఫిబ్రవరి 26: గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు సందర్భంగా 26 నుంచి 28 తేదీ వరకు విద్యార్థులకు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అవకాశాన్ని కల్పించినందున కళాశాల నుంచి దాదాపు 55 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన, సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

'ప్రజావాణి' సమస్యలను పరిష్కరించండి



సంగారెడ్డి రూరల్: సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు, ఫిబ్రవరి 26: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. నారాయణఖేడ్‌కు చెందిన జనార్ధన్‌రెడ్డి తమకు సంబంధించిన వారసత్వ భూమిని సర్వే చేసేందుకు చలానా కట్టి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసినా సర్వే చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన రుబీనా తనకు పింఛన్ ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 20 అర్జీలు, వివిధ శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు రాగా మొత్తం 70 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని ఏళ్ల తరబడి వదలకుండా స్టోర్ చేయడంతో తమ ప్లాట్లు మునిగిపోయాయని ఎఫ్‌టీఎల్‌కు ఎగువభాగంలో ఉన్న లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు వాపోయారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

'ప్రజావాణి'కి భూసమస్యల వెల్లువ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 81 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు ఇస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా ధరణి భూ సమస్యలు 32, ఉపాధి, విద్య వైద్యం 5, పెన్షన్లు 4, ఇతర సమస్యలపై 40 వినతులు అందాయి.

సత్వరమే పరిష్కరించాలి: ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డా. బాలస్వామి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ప్రజలను దరఖాస్తులను స్వీరించారు. గంజాయి సేవించి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణ, నివారణపై తీసుకోవాల్సిన అంశాలపై ఎస్పీ మాట్లాడారు.

అర్జీదారుల వినతులను పరిష్కరించాలి: డీఆర్వో

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 26: ప్రజావాణిలో వచ్చిన అర్జీదారుల వినతులను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో నాగరాజమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆమె 45 దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.

















మున్సిపల్ మాజీ చైర్మన్ బహిరంగ చర్చకు రావాలి

● అంబేడ్కర్ మాలసదర్ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 26: ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తున్నానని మున్సిపల్ మాజీచైర్మన్ తప్పుగా మాట్లాడారని, ఆయన బహిరంగ చర్చకు రావాలని అంబేడ్కర్ మాలసదర్ సంఘం నాయకులు జగన్, పురుషోత్తం పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆయనకు ఏ మాత్రం దళితులపై చిత్తశుద్ధి ఉన్నా సర్వే నంబర్ 1551లోని భూమి ఎస్సీ మాల కులస్థుల శ్మశానవాటిక కాదని ప్రమాణం చేయాలని లేదంటే బేషరతుగా క్షమాపణ డిమాండ్ చేశారు. సమావేశంలో ఆశయ్య, రాజారాం, రవి, బాలమల్లు, చంద్రయ్య, రాములు, పర్శయ్య, కనకమల్లయ్య, ఉషయ్య నర్సింహులు, ప్రవీణ్, మల్లేశం, వాసు పాల్గొన్నారు.

హుస్నాబాద్ పట్టణాన్ని అగ్రగామిగా నిలుపుతాం

● ఆదాయ వనరులను పెంచుకోవాలి

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 26 : హుస్నాబాద్ పట్టణాన్ని ప్రజలు ఊహించిన దానికంటే మెరుగ్గా అభివృద్ధి చేసి చూపిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘం 2024-25 బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేని, పన్నులు చెల్లించని, ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన ఇళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్‌లో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకూడదని సూచించారు. పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై మంత్రి స్పందిస్తూ ఆర్థిక వనరులు సమకూర్చుకోకపోవడం పాలకవర్గ అసమర్థత కిందకు వస్తుందని, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమైనా అందిస్తామని తెలిపారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కె.నళినిదేవి, రమాదేవి, కోమటి స్వర్ణలత, పెరుక భాగ్యారెడ్డి, శ్రీనివాస్, చిత్తారి పద్మ, వాల సుప్రజ, అయిలేని శంకర్‌రెడ్డి, గోవిందు రవి, ఎండీ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

మహిళా సంఘాలకు త్వరలో వడ్డీ లేని రుణాలను అందించబోతున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసి మాట్లాడారు. మంత్రి పట్టణంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. డయాలసిస్ సెంటర్‌తో పాటు 200 పడకలకు అప్‌గ్రేడ్ కావాల్సిన వసతులను, సౌకర్యాలను సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

హుస్నాబాద్‌లోని వైశ్య భవన్‌లో సోమవారం రాత్రి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, కోశాధికారి కొండ్లె మల్లిఖార్జున్, రాష్ట్ర నాయకులు గంప శ్రీనివాస్, రత్నాకర్, జిల్లా అధ్యక్షులు కాచం నవీన్, తడక లింగం, తనుకు అంజనేయులు పట్టణ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన కారును ఢీకొన్న మరో కారు

● నలుగురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు



ధ్వంసమైన కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు

కొండపాక, ఫిబ్రవరి 26: అదుపు తప్పి పల్టీ పడిన కారుకు మరో కారు ఢీకొన్నది. ఈ ఘటనలో నలుగురికి గాయాలైన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తిమ్మారెడ్డిపల్లి శివారులో అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టి.. మరోవైపు రోడ్డు పైకి వెళ్లింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. దాంతో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు కారులో ప్రయాణిస్తున్న కరీంనగర్ డైరీ అడ్వైజర్ హనుమంత్‌రెడ్డి(48), శోభన్(44), ప్రశాంత్(34)లతోపాటు హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఉన్న శోభన్(36)లకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కారులోంచి బయటకు తీశారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

వర్గల్, ఫిబ్రవరి 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అహ్మద్(28) ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మినాజీపేట అటవీ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇటీవల వివాహమైనట్లు స్థానికులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

దుబ్బాక, ఫిబ్రవరి 26: విద్యుదాఘాతంతో ఒక ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా.. మరో మూడు ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల నరేష్ దంపతులు సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లారు. కాగా ప్రమాదవశాత్తు అతడి ఇంట్లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగారంతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో ఇంట్లోని వస్తువులు, బట్టలు, సర్టిఫికెట్లు, బంగారం, రూ.40 వేల నగదు కాలిబూడిదయ్యాయి. పక్కనున్న పయ్యావుల భూజమ్మ, గాజుల ధర్మేందర్, గాజుల బాల్‌రాజ్ ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని దుబ్బాక ఎస్ఐ గంగారం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ పల్లె మీనారామస్వామిగౌడ్ సందర్శించారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కౌన్సిలర్ కోరారు.

బక్రిచెప్యాలలో గాంధీ విగ్రహం ధ్వంసం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26: గుర్తుతెలియని దుండగులు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బక్రీచెప్యాలలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గ్రామస్థులు గుర్తించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సలీం, గ్రామ ప్రత్యేకాధికారి రాజేశం, సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

దుండగులను శిక్షించాలి

చేర్యాల, ఫిబ్రవరి 26 : బక్రిచెప్యాల గ్రామంలో మహాత్మ గాంధీ విగ్రహాన్ని ధ్వంసంచేసిన దుండగలను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి, పట్టణాధ్యక్షుడు నీల శివకుమార్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్

బెజ్జంకి, ఫిబ్రవరి 26: ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులు నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించి రైతులను మోసం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కొరపాటి శివప్రసాద్ హెచ్చరించారు. బెజ్జంకి మండలంలోని రేగులపల్లి, గుండారం, బెజ్జంకి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లోని ఎరువుల, పురుగు మందుల నిల్వలను, అనుమతి పత్రాలను పరిశీలించారు. లైసెన్స్‌లో జత చేయని పలు ఉత్పత్తుల అమ్మకాలను ఆయన రద్దు చేశారు. మొగి పురుగు, అగ్గి తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఏఈవో సాయి శంకర్, ఏటీఎం సాయిశంకర్, పలువురు పాల్గొన్నారు.



బెజ్జంకిలోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఇసుక అక్రమ రవాణా

మద్దూరు, ఫిబ్రవరి 26 : మద్దూరు మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. మద్దూరు గ్రామానికి చెందిన కొంతమంది గ్రామ సమీపంలోని వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లో అక్రమ ఇసుక రవాణ జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిరుదొడ్డి, ఫిబ్రవరి26: మిరుదొడ్డి మండల కేంద్రంలోని నాగయ్య వాగునుంచి సోమవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, వాహనయాజమాని సంజీవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాం తెలిపారు.

రైస్‌మిల్లును తొలగించాలి

కొండపాక, ఫిబ్రవరి 26: ప్రజలకు ప్రాణాంతకంగా మారిన రైస్ మిల్లును తొలగించాలని కొండపాక మండలం బందారం గ్రామస్థులు అధికారులను కోరారు. గ్రామం మధ్యలో ఉన్న రైస్‌మిల్ నుంచి వెలువడే దుమ్ము, ధూళి వల్ల వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై ప్రజాభవన్‌లో ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు.

దుకాణాల ఏర్పాటుకు వేలం

నారాయణరావుపేట, ఫిబ్రవరి26: ఈ నెల 28న నారాయణరావుపేట మండల కేంద్రంలోని శ్రీబుగ్గరాజేశ్వరస్వామి దేవస్థానం వద్ద దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం వేస్తున్నామని ఆలయ చైర్మన్ పోదిల కిషన్ సోమావారం తెలిపారు. దేవస్థానం వద్ద కొబ్బరికాయలు, పులిహోర, వాహనాల పార్కింగ్ తదితరాలకి బహిరంగ వేలము దేవస్థాన అవరణలో నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు గంట ముందే ధరావత్తు చెలించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నిత్యయోగాతో వ్యాధులు దూరం

గజ్వేల్, ఫిబ్రవరి 26: నిత్యం యోగా చేయడం వల్ల అనేక వ్యాధులు, జబ్బులు దూరమవుతాయని సత్య సాయి ధ్యాన మండలి వ్యవస్థాపకుడు భిక్షమయ్య గురుజీ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయంలో సోమవారం యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో అనేక లాభాలు ఉంటాయని, ఎల్లప్పుడూ ధ్యానం చేయాలన్నారు. ధ్యానం ఎప్పుడు చేయాలి, తలరాతలు ఏ విధంగా మార్చుకోవాలి అనే అంశంపై ప్రసంగించారు. 50మంది ఈ ధ్యాన శిబిరానికి హాజరయ్యారు. ఆయన వెంట మధునాల శ్రీనివాస్, ఇస్మాయిల్, రాధాకృష్ణ, సూర్యారావు, చంద్రారెడ్డి, పండరి, విజయలక్ష్మి, వినోద, సునిత ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 26 :వరి పంట సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఉమారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వరి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రొటోకాల్ పాటించాలి

నారాయణరావుపేట, ఫిబ్రవరి26: ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటోలు ఏర్పాటు చేసి ప్రొటోకాల్ పాటించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బర్మ రాంచంద్రం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజీవ్‌లు పేర్కొన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామం పంచాయతీలో ముఖ్యమంత్రి ఫొటోను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా మాజీ ముఖ్యమంత్రి ఫొటోనే కొనసాగిస్తున్నారని, అధికారులు వెంటనే ప్రొటోకాల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్, బీసీ సెల్ నాయకులు తీగల బాస్కర్, నాయకులు కాంతయ్య, పర్శరాములు, దేవయ్య, బాలయ్య, రాజు, కనకయ్య, షాదూల్, ఇబ్రహీం, మల్లికార్జున్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం ఫొటోను అందజేస్తున్న నాయకులు

హాస్టల్ భవనాన్ని కేటాయించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 26 : చేర్యాల పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని స్థానిక ఎస్సీ విద్యార్థులకు కేటాయించాలని కోరుతూ, సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో రహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థుల వసతి కల్పనకోసం రూ.1 కోటికిపైగా వెచ్చించి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం నిర్మించారన్నారు. దాన్ని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు కేటాయించినా వారు కొన్ని రోజులు వినియోగించుకుని అర్థాంతరంగా ఖాళీచేసి పోయారని, ప్రస్తుతం ఇతర మండలానికి చెందిన కళాశాలకు అప్పగించాలని చూస్తున్నారన్నారు. స్థానిక ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులదృష్ట్యా హాస్టల్ భవనాన్ని వీరికే కేటాయించి, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి భరత్, సమీర్, మధు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ నాయక్

నంగునూరు, ఫిబ్రవరి 26 : పోలియో నివారణ కోసం ఈ నెల మూడు నుంచి చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మలేరియా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. సోమవారం నంగునూరులో పల్స్‌పోలియోపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలియో చుక్కలు వేసేందుకు నాలుగు రూట్లుగా విభజించి, 31 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలకు పోలియో చుక్కలు అందేలా 150 మంది సిబ్బంది, వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, ఎంఈవో దేశిరెడ్డి, తహసీల్దార్, వైద్యాధికారులు డాక్టర్ అంజలిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శివకేశవరెడ్డి, సూపర్‌వైజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 26 : కులమత బేధాలు లేకుండా ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకుని సన్మార్గంలో పయనించాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆశ్రమ పీఠాధిపతులు సూచించారు. మండలంలోని గాగిల్లాపూర్ ధ్యాన నిష్ఠ ఆశ్రమ 65వ వార్షికోత్సవ వేడుకలను, శ్రీదయానంద స్వామి 103వ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ధ్యాననిష్ఠ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానయజ్ఞ హోమాన్ని, గీతశ్లోక పారాయణాన్ని నిర్వహించారు. పీఠాధిపతులు శుద్ధ బ్రహ్మానందగిరి, పరబ్రహ్మానందగిరి, జగదీశ్వారానంద, సనకసనందన సరస్వతి, చిదానందగిరి, అద్వైత నందగిరి స్వాములు భక్తులకు ప్రవచనాలను బోధించారు.

భూ పంపిణీలో అర్హులకు న్యాయం చేయాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 26 : మండలంలోని గూడెం గ్రామంలో దళితులకు భూపంపిణీ పథకంలో భాగంగా కేటాయించేందుకు కొనుగోలు చేసిన భూమిలో అనర్హులకు పట్టాలు ఇచ్చారని, అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గూడెం గ్రామానికి చెందిన దళితులు తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యాంకు ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లేపల్లి గ్రామ శివారులో గూడెం గ్రామంలోని దళితులకు పంపిణీ చేసేందుకు, గత ప్రభుత్వం 60 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో అనర్హులకు పట్టాలు ఇచ్చి భూమిలేని వారిని విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వర్క్‌షాప్



కరపత్రం విడుదల చేస్తున్న కళాశాల అధ్యాపకులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 26 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పరిశోధన పద్ధతులు, వనరులు సమకూర్చుకునే మార్గాలు' అనే అంశాలపై మార్చి 22, 23 తేదీలలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. పరిశోదనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, అధ్యాపకులకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు హాజరుకావాలనుకునేవారు కళాశాలలో గాని, 7708556841 నంబర్‌కు గాని ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలిపారు.

మునిసిపల్ మాజీ చైర్మన్‌కు పరామర్శ

గజ్వేల్, ఫిబ్రవరి 26: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ గుండెకు బైపాస్ సర్జరీ అయిన విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం ఆయన్ను కలిసి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు ఆకుల దేవేందర్ ఉన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 26: మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ఎఫ్‌డీసీ మాజీ చెర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మర్కూక్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన నీరుడి రాజు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఆ కుటుంబాన్ని వారు సోమవారం పరామర్శించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు: ఏసీపీ

ములుగు, ఫిబ్రవరి 26: గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్ముతున్నారని సమాచారం ఉన్నదని, ఎవరు దొరికినా కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ బాలాజీ హెచ్చరించారు. సోమవారం ములుగు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లోని యువత గంజాయి సేవించి చెడిపోతున్నారని, గంజాయి తాగుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే గ్రామాల్లో మహిళలకు భద్రత కల్పించే విధంగా కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 26: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం పదో తరగతి పరీక్షలపై నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై, పలు అంశాల గురించి వివరించారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షలు ఏడు రోజుల్లో ఏడు పేపర్లుగా ఉంటాయని, ప్రతి అంశంపై కూలంకషంగా సీఎస్‌డీవోలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వారితో పరీక్షల విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, వీరేశం, గజ్వేల్ ఎంఈవో సునీత తదితరులున్నారు.

తొమ్మిది దాటినా వైద్యాధికారి రాలే!

మద్దూరు, ఫిబ్రవరి 26: మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వీడటం లేదు. ఉదయం 9 గంటల వరకు అందరూ రావాల్సి ఉండగా.. సోమవారం కేవలం స్టాఫ్‌నర్సు, అటెండర్ మాత్రమే హాజరయ్యారు. వైద్యాధికారి రాకపోవడంతో రోగులు తిరిగి వెళ్లిపోతున్నారు. ఇటీవల హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆస్పత్రులను సందర్శించి.. సిబ్బంది విధుల పట్ల మండిపడినా వారిలో మార్పురావడం లేదు. డీఎంహెచ్‌వో స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్యాధికారి లేక ఖాళీగా ఉన్న కుర్చీ

'ఇసుకను వినియోగించుకునే అవకాశం కల్పించాలి'

చేర్యాల, ఫిబ్రవరి 26: చేర్యాల మండలం ఆకునూరు గ్రామ శివారులోని వాగులో ఇసుకను స్థానిక అవసరాలకు వినియోగించుకునే అవకాశాన్ని కొనసాగించాలని కోరుతూ సోమవారం పెద్దవాగు పరిరక్షణ కమిటీ సభ్యులు గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ వాగులోని ఇసుకను గ్రామస్థులు ఎన్నో ఏళ్ల నుంచి గృహ నిర్మాణం, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల అవసరాల కోసం వినియోగించుకుంటున్నప్పటికీ ఇటీవల పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమ రవాణా చేస్తున్నారన్న అపోహతో పట్టుకుని కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. అనంతరం చేర్యాల తహసీల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకరి శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాక్టివిటీస్ బేస్‌డ్ శిక్షణకు ఉపాధ్యాయుల ఎంపిక

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 26: యాక్టివిటీస్ బేస్‌డ్ శిక్షణకు సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ ఐఐటీలో యాక్టివిటీస్ బేస్‌డ్‌పై శిక్షణ ఇస్తున్నారు. తాజాగా ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనుండగా సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా నుంచి రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కే.భాస్కర్‌రెడ్డి, మర్కుక్ మండలం దామరకుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వై.బ్రహ్మయ్య, సిద్దిపేట గవర్నమెంట్ న్యూహైస్కూల్ ఉపాధ్యాయుడు బీ.రవీందర్ ఎంపికయ్యారు. 28 నుంచి మార్చి 3 వరకు వీరికి గాంధీనగర్ ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నారు.

'ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలి'

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 26: రైతులు ఆధునిక పద్ధతుల్లో కూరగాయల పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సౌమ్య పేర్కొన్నారు. సోమవారం మర్కుక్ మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయ పంటలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో 347 ఎకరాల కూరగాయలు సాగులో ఉన్నాయని తెలిపారు. సాంకేతిక పద్ధతులను అనుసరించి కూరగాయలు పండిస్తే అధిక లాభాలు పొందొచ్చని సూచించారు.

ముగిసిన 'జీసీఎల్' టోర్నీ

గజ్వేల్, ఫిబ్రవరి 26: గజ్వేల్ పట్టణంలో మూడురోజులుగా నిర్వహించిన గజ్వేల్ క్రికెట్ లీగ్ టోర్నీ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ పోటీల్లో విజేతగా తల్వార్ బాయ్స్ టీం, రన్నరప్‌గా ఎస్ఎస్ స్పోర్ట్స్ టీం నిలిచింది. మొదటి విజేతకు రూ.40వేలు, ట్రోఫీ, రన్నరప్‌కు రూ.20వేల బహుమతి, ట్రోఫీని కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్‌కుమార్‌గుప్తా చేతుల మీదుగా అందజేశారు. టోర్నీ నిర్వాహకులు సూర్యప్రకాశ్, బొజ్జ రవి, భరత్, హరిచంద్రప్రసాద్, స్వామిని అభినందించారు.

ఇచ్చిన హామీలను అమలుచేస్తున్న కాంగ్రెస్

● దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, ఫిబ్రవరి 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అమలుపరుస్తున్నదని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దౌల్తాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రెండు గ్యారెంటీలను ప్రారంభిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, ఎంపీటీసీ ఆదివనిత, మాజీ సర్పంచులు ఆది వేణుగోపాల్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట టౌన్: ఇచ్చిన హామీల మేరకు మరో రెండు పథకాలను ఈ నెల 27న సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న మరో రెండు పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ స్టేట్ కోఆర్డినేటర్ దాసరి రాజు, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

● కోహెడ: రాబోయే రోజుల్లో మిగతా హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నుంచి మరో రెండు హామీలను అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, భీంరెడ్డి మల్లారెడ్డి, డొమ్మాట జగన్‌రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి తిరుపరెడ్డి, వెంకటస్వామి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీన వెని రాకేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహ్మద్ అబ్దుల్ రఫీ, మహ్మద్ అంకూష్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో మాట్లాడుతున్న అత్తు ఇమామ్

● అక్కన్నపేట: కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య అన్నారు. సోమవారం అక్కన్నపేట మండలం జనగామ, అంతకపేట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న మరో రెండు గ్యారంటీలు పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇందులో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ స్నేహ, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, ఎంపీటీసీలు కంది రజితశ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.